# అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి



వాషింగ్టన్: అమెరికాలో ఒక తెలుగు కుర్రాడి కిలకిల నవ్వులు గాలిలో కలిసిపోయాయి. గలగల ప్రవహించే నదిలో మరలిపోయాయి. సరదాగా స్నేహితులతో ఆటవిడుపు కోసం నదిలో విహారానికి వెళ్ళిన ఆ ఆంధ్ర విద్యార్థిని అనూహ్యంగా మృత్యువు కబళించింది. అంతవరకూ నవ్వుతూ, తుళ్ళుతూ సహపాఠీలతో కమ్మని కబుర్లు చెప్పిన ఆతను కన్న తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోయాడు. ఒక జ్ఞాపకంగా మిగిలిపోయాడు!.

అమెరికాలో మరో తెలుగు తేజం నేలరాలింది. విశాఖపట్నానికి చెందిన గౌతమ్ సోసఫ్ (24) ప్రమాదవశాత్తూ నదిలో బోటు బోల్తా పడి ప్రాణాలు కోల్పోయారు. లూసియానా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ మాస్టర్స్ చేస్తున్న జోసఫ్ స్మైల్ స్నేహితులతో కలిసి శుక్రవారం మిస్సిసిపి నదిలో విహారానికి వెళ్ళిన సందర్భంలో బోటు మునిగిపోయింది. ఆ సమయంలో అక్కడే వున్న రక్షణ సిబ్బంది అప్రమత్తమై వీరిలో ఏడుగురిని రక్షించారు. అయితే అప్పటికే ఆలస్యం కావడంతో జోసఫ్ మృతిచెందినట్లు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ప్రతినిధులు వెల్లడించారు.

జోసఫ్ తండ్రి శామ్యూల్ స్మైల్ విశాఖపట్నంలోని భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెస్సెల్స్ లిమిటెడ్ (బిహెచ్‌పీవీ)లో ఉద్యోగి కాగా, తల్లి హేమలత ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. జోసఫ్‌కు ఓ సోదరి కూడా వున్నారు. స్థానిక ఎమ్‌వీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ పూర్తిచేసిన జోసఫ్ ఉన్నతాభ్యాసం నిమిత్తం 2009, జనవరి మాసంలో అమెరికా చేరుకున్నారు. అక్కడి లూసియానా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ మాస్టర్స్‌లో చేరారు. ప్రస్తుతం చివరి సెమిస్టర్‌లో ఉన్న జోసఫ్ కొంతకాలం గడిస్తే క్షేమంగా స్వదేశం చేరుకునే వాడేనేమో!. కానీ విధి వక్రించింది...!

జోసఫ్ మృతివార్త తెలిసిన వెంటనే వారి కుటుంబ సభ్యులు నిలువునా కుప్పకూలారు. కంటికి మంటికి ఏకధారగా విలపించారు. వారి బంధువులు జోసఫ్ మృతివార్త పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంటు సభ్యురాలు పురంధరేశ్వరి స్వయంగా కుటుంబ సభ్యులను పలకరించారు. 'తానా' కార్యనిర్వహక అధ్యక్షులు తోటకూర ప్రసాద్‌తో ఫోన్ ద్వారా మాట్లాడివీలైనంత త్వరగా జోసఫ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి పంపే ఏర్పాట్లు చేయమని కోరారు. భారత విదేశాంగ శాఖ సహా అధికార యంత్రాంగం నుంచి అన్నివిధాలైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు 'తానా' ప్రతినిధులు వెల్లడించారు. ఇక్కడి నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సెప్టెంబర్ 8న జోసఫ్ మృతదేహాన్ని స్వదేశం తరలిస్తామని వారు తెలియజేశారు.